క్లుప్తంగా

గెలుపుకోసం కృషిచేద్దాం

జడ్చర్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మాచారం, పోలేపల్లి, కిష్టారం, ఖానాపూర్ గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, శంకర్ నాయక్, ప్రణీల్‌చందర్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరండి

బాలానగర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచందర్ రెడ్డి నామినేషన్ వేయనున్న నేపథ్యంలో కార్యకర్తలు భారీగా తరలిరావాలని మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్లకు వచ్చి అక్కడి నుంచి ర్యాలీగా జిల్లా కేంద్రానికి వంశీచందర్‌రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మంగళవారం పాఠశాలల్లో అవార్డులను ప్రదానం చేశారు. లోకేష్ 2వ ర్యాంక్, 3వ ర్యాంక్ సాయిఅశ్విత్ సాధించగా మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కిడ్డీ బ్యాంక్, పెన్సిల్, పౌచ్‌లు, గోల్డ్ మెడల్స్‌లను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ గతంలోనూ ఐఎన్‌టీఎస్ ఒలంపియాడ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చినట్లు వివరించారు. పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ ప్రోత్సాహంతో విద్యార్థులు ముందుకు సాగుతున్నారని అన్నారు. స్కూల్ కోఆర్డినేటర్ మృదుల, ఇన్‌చార్జ్ ప్రియ, రాణి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



జడ్చర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జడ్చర్లలో పోలీసు ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. నిమ్మబాయిగడ్డ ప్రాంతం నుండి నేతాజీ చౌరస్తా, సిగ్నల్‌గడ్డ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు కవాతు కొనసాగింది. ప్రజలు ఎన్నికల సమయంలో భయభ్రాంతులకు గురికాకుండా ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా స్థానిక సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కుకు భంగం కలిగే విధంగా వ్యవహరించే వారిపై తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

75 రోజుల పాటు నవజాత శిశువుకు ప్రత్యేక చికిత్స

పాలమూరు: జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువుకు దాదాపు 75రోజుల ప్రత్యేక చికిత్స అందించి బరువు పెరిగే విధంగా కృషి చేశారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో డాక్టర్ ప్రతిభ, డాక్టర్ లత ప్రియాంక వివరాలు వెల్లడించారు. మిడ్జిల్ మండలం వల్లభ్‌రావుపల్లికి పూజ, మహేష్ దంపతులకు మొదటి సంతానంలో మగ శిశువు జన్మించాడు. సరైన రక్త ప్రసరణ అందకపోవడంతో నెలలు నిండక ముందే ఏడవ నెలలో ప్రసవం అయ్యింది. దీంతో పాటు 28 వారాల్లో పుట్టడం వల్ల శ్వాస సమస్యలు, ఎన్‌ఈసీ, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఫిబ్రవరి 2న ఆస్పత్రికి శిశువును తీసుకువచ్చినప్పుడు కేవలం 825గ్రాములు మాత్రమే ఉండగా.. చికిత్స అనంతరం ప్రస్తుతం 1.7కేజీల బరువు పెరిగే విధంగా కృషిచేసినట్లు వైద్యులు వివరించారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- పార్టీ గెలుపుకోసం కృషిచేయాలి
- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

చిన్నచింతకుంట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే తెలంగాణ అన్నివిధాల అభివృద్ధి చెందిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిన్నచింతకుంట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టి రామ్మోహన్, అంజయ్య యాదవ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లిపూరం వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రాజెక్టులు చేపట్టి రైతుకు ప్రతి ఎకరాకు సాగు నీరు అందించారని పేర్కొన్నారు. మోస పూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. వందరోజులు గడుస్తున్నా ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా చేసిందేమీ లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజల ప్రయోజనాలు, ముఖ్యం కాదన్నారు. అధికారాలు చేపట్టడమే వారి ఉద్దేశమన్నారు.

వంద రోజులలో వంద సమస్యలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో వందరోజులల్లో వంద సమస్యలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజలు కరువు కష్టాలతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు.

వెన్నుపోటు దారుల వల్లే ఓటమి

వెన్నుపోటు దారుల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వరి, రైతు సమన్వయ కమిటీ జిల్లా మెంబర్ కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట రాము, నాయకులు వేణుగోపాల్, వెంకటేశ్వరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

దేవరకద్ర: మండలంలోని గూరకొండ, బస్వాపూర్, పెద్దరాజమూర్ గ్రామాల పరిధిలో ఉన్న కోయిల్ సాగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని దీన్ని అరికట్టాలని ఎంపీపీ రమాదేవి అధికారులను కోరారు. మంగళవారం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సభలో ఆమె మాట్లాడారు. ఇసుకను తరలించడం వల్ల వాగులో రైతులు వేసుకున్న బోర్లు అడుగంటిపోతున్నాయని అన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా చేస్తున్న ఇసుక తరలింపును అడ్డుకోవాలని ఆమె కోరారు. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసులు వెంటనే చర్యలు తీసుకుంటామని ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టి పట్టుకుంటామని తెలిపారు. అదేవిధంగా మిషన్ కాకతీయ పథకం కింద మూడు చెరువుల పనులు ప్రగతిలో ఉన్నాయని మిగతా పనులన్ని పూర్తి అయినట్లు సంబంధిత అధికారి తెలిపారు. దేవరకద్ర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలాంటి సెలవులు లేవని ఐసీడీఎస్ అధికారి తెలిపారు. మే నెలలో 15 రోజులు అంగన్‌వాడీ టీచర్, 15 రోజులు ఆయా అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచి విధులు నిర్వహిస్తారని తెలిపారు. దేవరకద్ర పీహెచ్‌సీ పరిధిలో మూడు నెలల్లో 15,709 మంది రోగులు వైద్య సేవలు పొందారని, పేరూర్ పీహెచ్‌సీ పరిధిలో 313 కాన్పులు జరిగాయని వైద్యాధికారి రఘువరన్ తెలిపారు. యాసంగి పంటల పెట్టుబడి కింద 18,620 మంది రైతులకు రూ.14 కోట్ల92 లక్షలు బ్యాంకు ఖాతాలలో జమ చేశారని ఏఓ రాజేందర్ అగర్వాల్ తెలిపారు. రైతు భీమా కింద 62 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 49 మందికి చెక్కులు అందాయని తెలిపారు. మిగతావి ఎల్ఐసీ నుంచి రిటర్న్ అయ్యాయని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో జరుగుతున్న పనులపై ఏఈ కురుమూర్తి వివరణ ఇవ్వగా మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరాఫరాపై ఏఈ కీర్తి వివరించారు. విద్యాశాఖ, విద్యుత్, ఉపాధిహామి, పౌరసరాఫరాలు ఇంకా పలు అంశాలపై సంబంధిత కింద స్థాయి అధికారులు హాజరు అయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, కౌకుంట్ల తహసీల్దార్ ఎల్లయ్య, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు హాజరు అయ్యారు.

'డైట్' మైదానంలో సౌకర్యాలు కల్పించాలి



సమస్యలను విన్నవిస్తున్న వాకర్స్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక డైట్ కళాశాల ప్రాంగణంలో తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని పాలమూరు మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్‌కు సీనియర్ సిటిజన్స్, వాకర్స్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి వచ్చిన ఆయనతో వారు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. డైట్ చుట్టూ ప్రహరీ అసంపూర్తిగా ఉండటంతో లోపలికి రాత్రివేళ కొందరు వ్యక్తులు వచ్చి మద్యం తాగి ఖాళీ సీసాలు పడేసిపోతున్నారని వాపోయారు. ముఖ్యంగా క్రీడా మైదానం ఎగుడు దిగుడుగా ఉండటంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. భూమిని చదును చేయాలని, మినీ వాటర్‌ట్యాంకు వద్ద నల్లాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

పనుల పరిశీలన

దేవరకద్ర: ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మల్లెల పాపయ్య కుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. పనుల వద్ద తాగునీరు, నీడ కోసం టెంటు సౌకర్యం కల్పించాలని తెలిపారు. మండలంలో 2700 మంది కూలీలు ఉపాధి పనులలో పాల్గొంటున్నారని తెలిపారు.

బాలిక అదృశ్యం

జడ్చర్ల: కోడ్గల్‌కి చెందిన ఓ బాలిక కనిపించకుండా పోవడంతో ఆమె తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. లింగంపేటలో కుట్టుమిషన్ నేర్చుకోవడానికి రోజులాగే వెళ్లిన బాలిక సోమవారం తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టుపక్కలా, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

జడ్చర్ల: అగ్నిప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రమాదాల నుంచి బయటపడేలా అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక పద్మావతీ కాలనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో వెంటనే 101 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, ఫైర్ సిబ్బంది వెంకటయ్య, నవీన్ కుమార్, గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

మహబూబ్‌నగర్ క్రైం: రైలులో ప్రయాణికుల దగ్గర సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం సాధారణ తనిఖీల్లో గోపాల్‌పేట్ మండలం చెన్నూర్‌కు చెందిన శ్రీకాంత్, రాజ్ కుమార్ కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వస్తున్న రైలులో పట్టుబడ్డారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ వెల్లడించారు.

బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలి



మాట్లాడుతున్న టి. సాగర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజ్యాంగ హక్కులను హరిస్తూ, లౌకిక విలువలను పాతరేస్తున్న బీజేపీని కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కుతూ పరిపాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిందేనన్నారు. వామపక్ష ఉద్యమాలతో వచ్చిన ఉపాధిహామీ పథకానికి నిధుల్లో కోతలు పెట్టి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. నూతన చట్టాలు తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పెట్టుబడికి 50 శాతం అదనంగా ఉండేలా గిట్టుబాటు ధర కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కుతున్నారన్నారు. విద్యారంగంలో మతోన్మాదాన్ని ప్రవేశపెట్టి లౌకికవాదానికి చిచ్చు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇక భువనగిరిలో సీపీఎం అభ్యర్థి పోటీలో ఉంటారని, మిగతా 16 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను గడువులోగా నెరవేర్చకపోతే ఎర్రజెండా ఉద్యమాలకు సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, బొల్లె చంద్రకాంత్, కురుమయ్య, వి.పద్మ, జిల్లా కమిటీ సభ్యులు కడియాల మోహన్, జగన్, నర్సింహులు, లక్ష్మయ్య, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: కారుకొండ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్‌కు తరలుతున్న అక్రమ ఇసుక టిప్పర్‌ను కారుకొండ గేట్ సమీపంలో పెట్రోలింగ్ బృందం పట్టుకున్నట్లు వివరించారు. కాగా డ్రైవర్ పరారయ్యాడని పేర్కొన్నారు. టిప్పర్ యజమాని సత్యనారాయణపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

మూసాపేట మండలంలో ట్రాక్టర్లు..

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మదు స్సేన్‌పల్లి గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సుజాత తెలిపారు. గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో సోమవారం అర్ధరాత్రి స్థానిక పెద్దవాగులో ఇసుకను నింపుకొని వెళ్తుండగా వాటిని పట్టుకుని ఠాణాకు తరలించినట్లు చెప్పారు. రెండు ట్రాక్టర్లను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జరిమానా నిమిత్తం ట్రాక్టర్లను మంగళవారం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా గోర్‌బంజారా ప్రీమియర్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో మంగళవారం గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ (జీబీపీఎల్ సీజన్–7) అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నీ ప్రారంభోత్సవానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. సేవాలాల్ మహరాజ్ దైవంతో సమానమని, ఆయన చూపిన బాటలో నడవాలని కోరారు. గ్రామీణ క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. కాగా, జీబీపీఎల్ క్రికెట్ టోర్నీలో మొదటి రోజు మ్యాచుల్లో రాథోడ్ రాకర్స్ జట్టు 19 పరుగుల తేడాతో చౌహాన్ బంజారా జట్టుపై, సేవాలాల్ మహరాజ్ జట్టు 49 పరుగుల తేడాతో హతీరాం బావా జట్టుపై విజయం సాధించాయి. కార్యక్రమంలో జీబీపీఎల్ కమిటీ చైర్మన్ రమావత్ రవిరాథోడ్, సభ్యులు కృష్ణానాయక్, పున్యానాయక్, నరేష్, మోహన్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమనాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం వైస్‌చైర్మన్ ఆర్.శేఖర్ నాయక్, గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌నాయక్, కోశాధికారి కిషన్ పవార్, గోవర్ధన్ నాయక్, రాములు పాల్గొన్నారు.

రూ. 59వేల నగదు పట్టివేత

బాలానగర్: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ. 59వేల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు. కర్నూల్ జిల్లా దేవరకొండ మండలం బేతపల్లికి చెందిన లక్ష్మయ్య ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

కనులపండువగా పల్లకీసేవ

గండేడ్: శ్రీరామనవమిని పురస్కరించుకొని వెన్నాచేడ్‌లో పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు పుల్లారెడ్డి, బోయిని గోపాల్, సత్యసాయి సేవాసమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ మల్లప్ప, కన్వీనర్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడడం తగదు



మాట్లాడుతున్న రాములు

పాలమూరు: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే.. తమ కార్యకర్తలు తరిమికొట్టే పరిస్థితి వస్తుందని బీజేపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి కె.రాములు అన్నారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వికారాబాద్–పరిగి, కొడంగల్–కృష్ణ రైల్వే లైన్ కోసం కృషి చేశానని చెబుతున్నాడని.. ఆయనకు కొంతైనా అవగహన ఉందా అంటూ విమర్శించారు. కృష్ణ రైల్వే లైన్ కోసం 2021లో డీకే అరుణ ఆధ్వర్యంలో రైల్వే మంత్రికి వినతి పత్రం ఇస్తే..దానికి స్పందిస్తూ 2023లో రూ.4193కోట్ల నిధులను కేటాయించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నారాయణ పేటకు సైనిక్‌స్కూల్ మంజూరు చేస్తే..అప్పటి సీఎం కేసీఆర్ స్థలం కేటాయించకపోవడం వల్ల అమల్లోకి రాలేదన్నారు. కేసీఆర్‌తో కుమ్మక్కై పాలమూరు–రంగారెడ్డి డిజైన్ మార్పునకు రేవంత్ కారణమయ్యారన్నారు. కార్యక్రమంలో నిరంజనమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పద్మవేణి, బుచ్చిరెడ్డి, సత్యం, పాండు రంగారెడ్డి,అంజయ్య, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు బ్యానర్‌లలో రాముడి బొమ్మ వేసుకున్నంత మాత్రాన కాషాయవాదులు కాలేరని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. జిల్లా కార్యాలయంలో యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోసం మాత్రమే ఇలాంటివి చేస్తున్నారని ఆరోపించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహమ్మదాబాద్: నిబంధనలకు విరుద్ధంగా తన ఇల్లు కూల్చివేశారని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే మహమ్మదాబాద్ మండల పరిధిలోని మొకర్లాబాద్‌లో నీరటి లక్ష్మయ్య ఇల్లును రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేశారు. అయితే నిబంధనల కంటే ఎక్కువగా కూల్చారని బాధితుడు ఆరోపిస్తున్నారు. సోమవారం నేషనల్ హైవే అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. కాగా వారు మంగళవారం వచ్చి వాస్తవాలను పరిశీలిస్తామని చెప్పారు. కానీ ఏ ఒక్కరూ రాలేదని బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ బలం పెరుగుతోంది



నవాబుపేట: బీజేపీ బలం రోజురోజుకూ పెరుగుతోందని.. మూడోసారి మోదీ ప్రధాని అవుతారని పార్టీ జిల్లా నాయకులు బాలవర్ధన్‌గౌడ్, బాలత్రిపురసుందరీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గురువారం నామినేషన్ వేస్తారని.. కార్యకర్తలు, నాయకులు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు యాదయ్య, శ్రీను, బాలు, సతీష్, శంకరయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న అఖండ భజనలు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో అఖండ భజనలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన స్వరలహరి కల్చరల్ అకాడమీకి చెందిన మాజీ ఎస్ఐ భాగన్నగౌడ్ బృందం ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక భజనలు, కీర్తనలు ఆలపించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వారి కార్యక్రమం అందరిని అలరించింది.



సీతారాముల కల్యాణం చూతము రారండి



జడ్చర్లలో ఏర్పాటు చేసిన చలువపందిళ్లు

- నేడు వైభవంగా వేడుక
- ముస్తాబైన ఆలయాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూమోతీనగర్‌లోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎన్.ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు

జడ్చర్ల టౌన్: శ్రీరామనవమి పురస్కరించుకుని పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలని సీతారామంజనేయస్వామి దేవాలయంలో కల్యాణోత్సవానికి చలువ పందిళ్లు సిద్ధమయ్యాయి. ఏటా ఆలయంలో వేడుక అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.

దేవరకద్ర: మండలంలోని ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు. అదే విధంగా దేవరకద్ర మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, పేరూర్, కౌకుంట్ల, పుట్టపల్లి, కోయిల్‌సాగర్, నార్లోనికుంట్ల, ఇంకా పలు గ్రామాలలో దేవాలయాలన్ని సీతారాముల కల్యాణం కోసం ముస్తాబు చేసి పందిళ్లను వేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



సీతారాముల విగ్రహాలు

గండేడ్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా వెన్నాచేడ్‌లో బుధవారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఏటా చెరువు బండపై కొలువు దీరిన సీతారాముల జాతర ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయి. మొదటి రోజు శకటోత్సవం, పల్లకీసేవ నిర్వహిస్తారు. గురువారం తెల్లవారుజామున రథోత్సవం ఉంటుందని మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి తెలిపారు. అదేరోజు రాత్రి నందికోళ్ల సేవ శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండం కార్యక్రమం ఉంటుందని వివరించారు. అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వసంత కవితోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) సాయంత్రం 4గంటలకు జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్, గైడ్స్ భవనంలో వసంత కవితోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వివరాలను పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



వెన్నచేడ్‌లో..


కాంగ్రెస్‌లో చేరిక

చిన్నచింతకుంట: అప్పంపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ యాదవ్‌తోపాటు గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం దమాగ్నపురంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు సురేందర్‌రెడ్డి, జి.సుదర్శన్, పి రాఘవరెడ్డి, పల్లె వెంకటన్న, బొట్లంశ్రీను, రాజరెడ్డి పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఈ వేసవి సెలవులు ముగిసేలోగా అన్ని వసతుల కల్పన కోసం నిత్యం ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పూర్తి చేయాలని.... ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షదాయకమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కానీ నిబంధనల ప్రకారంగా ప్రధానోపాధ్యాయులకు నెల రోజుల ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం 2016 మధ్యాహ్న భోజన విధులు నిర్వహింపజేసుకొని ఆర్జిత సెలవులు ఎగ్గొట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం అలా చేయకూడదని ఆయన కోరారు.

సర్వీస్ రోడ్డుపైకి దూసుకొచ్చిన కారు



సర్వీస్ రోడ్డుపై నేలకూలిన స్తంభం

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతులకు ముప్పు తప్పి పోయింది. హైవేపై వెళ్తున్న వాహనం అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లి వరి ధాన్యం కుప్పపై నిలిచిపోయింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు అక్కడున్న రైతులకు తృటిలో ప్రమాదం తప్పిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం..జానంపేట గ్రామంలోని సర్వీస్ రోడ్డుపై రైతులు వరి ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి దూసుకొచ్చింది. రోడ్డు పక్కన వీధిలైట్ల స్తంభాన్ని ఢీకొట్టింది. ఘటనలో స్తంభం నేలకూలింది. తర్వాత పంప్‌హౌస్ గోడను ఢీకొట్టి సర్వీస్ రోడ్డుపై ఉన్న రైతు బచ్చప్ప వరి ధాన్యం కుప్పపై నిలిచి పోయింది. ఈ సమయంలో వరి ధాన్యం వద్ద ఉన్న రైతులు కొంత దూరం వెళ్లి మరో రైతు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్నారు. దీంతో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. కారులో ఉన్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.